
# "అన్నమాట కాదు ఉన్నమాటే!"



# అంపశయ్య నవీన్

కథ

"హాయ్ రఘూ! హౌ ఆర్ యూ?" అన్నాడు సూర్యం తన ఒకప్పటి స్నేహితుడు రఘును చూడగానే.

వాళ్లిద్దరూ ఓ సూపర్ మార్కెట్లో కలుసుకున్నారు. వాళ్ల పక్కనే వాళ్ల భార్యలు కూడా ఉన్నారు.

"అయామ్ ఫైన్ సూర్యం... థాంక్యూ" అన్నాడు రఘు.

"కంగ్రాచ్యులేషన్స్... ఈ మధ్యనే పెళ్లి చేసుకున్నావట. నేను మీ పెళ్లికి రాలేకపోయాను. సారీ!" అన్నాడు సూర్యం.

"ఎందుకు రాలేదు?" అన్నాడు.

"మీ పెళ్లయినప్పుడు నేనీదేశంలోనే లేను. మా కంపెనీవాళ్లు నన్ను అమెరికాకు పంపించారు" అన్నాడు సూర్యం.

"దేశంలోనే లేనివాడివి ఎలా వస్తావులే" అన్నాడు రఘు.

ఇద్దరూ పెద్దగా నవ్వారు.

"బైదిబై... ఈమె నా అర్ధాంగి, దివ్య" అంటూ రఘు తన పక్కనే ఉన్న దివ్యను పరిచయం చేశాడు.

"నైస్ మీటింగ్ యూ దివ్యా! ... బైది బై, నా బెటర్‌హాఫ్‌ను కూడా పరిచయం చెయ్యనీయండి. ఈమె నా భార్య, రజిత" అన్నాడు సూర్యం.

"హాయ్ రజితగారూ! మిమ్మల్ని చూసినప్పట్నించీ ఎక్కడ చూశానా అని మధనపడ్తున్నాను... ఇప్పుడు గుర్తొచ్చింది, మీరు రెడ్డీ విమెన్స్ కాలేజ్‌లో చదివారు కదూ?" అన్నాడు రఘు బోల్డు సంబరపడిపోతూ.

"అవును!" అంది రజిత కొంచెం ఆశ్చర్యపడిపోతూ.

"నేనా కాలేజిలో కొద్దిరోజులు మాత్రమే లెక్చరర్‌గా పని చేశాను. అప్పుడు మిమ్మల్ని చాలాసార్లు చూశాను. అఫ్‌కోర్స్, నేను మీ క్లాసుకెప్పుడూ రాలేదనుకోండి...".

"అవును... నేను సైన్స్ స్టూడెంట్‌ను కాదు కదా...కానీ మిమ్మల్ని చూసినట్టు నాకిప్పుడు గుర్తొస్తోంది. మీరు కెమిస్ట్రీ చెప్పేవారనుకుంటాను" అంది రజిత.

"అవును... నేనా కాలేజిలో చాలా కొద్దిరోజులే పనిచేశాను లెండి. నాకు యూనివర్సిటీలో లెక్చరర్‌గా అపాయింట్‌మెంట్ రాగానే వెళ్లిపోయాను. ఎనీవే, మిమ్మల్నిప్పుడు నా స్నేహితుడి భార్యగా చూసినందుకు చాలా సంతోషిస్తున్నాను" అన్నాడు రఘు.

"నిజమే- చాలా రోజుల తర్వాత మనం మన బెటర్ హాఫ్స్‌తో ఇలా కాకతాళీయంగా కలుసుకోవడం చాలా ఎక్సైటింగ్‌గా ఉంది" అన్నాడు సూర్యం.

"మనం ఇలా అనుకోకుండా హడావిడిగా ఓ సూపర్ మార్కెట్‌లో షాపింగ్ చేస్తూ కలుసుకోవడమేమిటి? మీరోసారి మా ఇంటికి రండి. తీరిగ్గా మాట్లాడుకోవచ్చు" అన్నాడు రఘు.

"తప్పకుండా... మీరూ ఓసారి మా యింటికి రండి. వచ్చేముందు ఫోన్ చేసి రండి" అంటూ సూర్యం తన జేబులోంచి విజిటింగ్ కార్డు తీసిచ్చాడు.

"మీరు నా విజిటింగ్ కార్డు కూడా తీసుకోండి" అంటూ రఘు తన విజిటింగ్ కార్డు తీసిచ్చాడు.

పరస్పరం బై చెప్పుకొని వాళ్లు విడిపోయారు. సామాన్లు తీసికొని షాపులోంచి బయటకొచ్చి కార్లో కూర్చోగానే "సూర్యం నిజంగా అదృష్టవంతుడు" అన్నాడు రఘు.

"ఎందుకు?" అంది దివ్య ఆయన ఆ మాట ఎందుకన్నాడో ఊహించడానికి ప్రయత్నిస్తూ...

"అంత అందమైన భార్యను పొందినందుకు... కళ్లు మిరిమిట్లు గొల్పే అందం ఆమెది... ఆమె మీది నుండి నా కళ్లను మళ్లించుకోలేకపోయానంటే నమ్ము" అన్నాడు రఘు.

పక్కనే భార్యను పెట్టుకొని, పరాయి స్త్రీ అందాన్ని ఇంతగా పొగుడుతున్న అతన్నెలా అర్థం చేసుకోవాలో దివ్యకు అంతుపట్టలేదు.

తనను కూడా చాలామంది చాలా అందంగా ఉన్నావనే అంటారు. కానీ తన భర్తకు మాత్రం తను అందమైన దానిలా కనిపించకపోవడం, ఓ పరాయి స్త్రీ అందంగా కనిపించడం ఆమెను ఆశ్చర్యపరిచింది.

"నేను రజిత చదువుకుంటున్న కాలేజిలో పనిచేస్తున్న రోజుల్లో వీలయినప్పుడల్లా ఆమె కేసి

అదేపనిగా కళ్ళప్పగించి చూస్తుండేవాడిని. వెంటనే అందమైన కలల్లోకి వెళ్లిపోతుండేవాడిని. ఈమెను నా సహధర్మచారిణిగా చేసుకోగల్గితే నా జన్మ ధన్యమౌతుందని కూడా అనుకునేవాడిని" అన్నాడు రఘు.

చేసుకున్నదానితో ఇట్లా మాట్లాడటానికి ఇతనికెంత ధైర్యం? ...ఉన్నత చదువులు చదివినవాడు, సంస్కారవంతుడిగా పేరున్నవాడు మాట్లాడాల్సిన మాటలేనా ఇవి? ఎదుటి వ్యక్తి బాధపడ్తుందేమోనన్న జ్ఞానం ఈయనకు కొంచెం కూడా ఉన్నట్టు లేదే... అనుకుందామె.

"నువ్వేమీ మాట్లాడటం లేదు? ఆమెను పొగిడేస్తున్నానని బాధపడిపోతున్నావా? ఒక స్త్రీ ఇంకో స్త్రీ అందంగా ఉందంటే ఒప్పుకోదంటారు. నిజమేనా?" అన్నాడు.

"నేనేమీ బాధపడిపోవడంలేదు... కానీ జాలిపడ్తున్నాను" అంది దివ్య కసిగా.

"ఎవరి మీద?" అన్నాడు రఘు.

"మీమీదనే"

"ఎందుకు?"

"మిమ్మల్ని అందమైన కలల్లోకి పంపించిన ఆ జగదేక సుందరిని చేసుకోలేకపోయారే అని"

"మన చేతుల్లో యేముంది? ఎవరు ఎవర్ని చేసుకోవాలో మొదలే నిర్ణయమైపోతుందటకదా... అందుకే "మ్యారేజెస్ ఆర్ మేడిన్ హెవెన్" అంటారు. నేను నిన్ను చేసుకోవాలని రాసి పెట్టాక ఆమెనెలా చేసుకుంటాను?"

"అంటే... అంటే... ఇష్టం లేకుండానే తప్పదని మీరు నన్ను చేసుకున్నారా?" ఆమె కంఠం రుద్ధమైపోతున్నదని అతడు గ్రహించాడు.

"ఓ, కమాన్ దివ్యా. ఇంత మాత్రానికే నొచ్చుకుంటున్నావా? ఊరికేనే. జస్ట్ ఫర్ ఫన్... జోక్ చేశానంతే... నిన్ను ఇష్టపడే చేసుకున్నాలే... డోన్ట్‌వర్రీ..." అన్నాడు రఘు దివ్యను దగ్గరకు తీసుకుంటూ.

ఇది జరిగిన కొద్దిరోజుల తర్వాత రఘు, దివ్య కొత్తగా రిలీజయిన ఓ సినిమాకెళ్ళారు.

టికెట్స్ కౌంటర్ దగ్గర రఘుకు అతని ఫ్రెండ్ సాగర్ కనిపించాడు. సాగర్ పక్కనే అతని భార్య సమత కూడా ఉంది. వాళ్లను చూడగానే రఘు ఉత్సాహంగా

"హాయ్ సాగర్, హాయ్ సమతా!" అంటూ పలకరించాడు.

వాళ్లను దివ్యకు పరిచయం చేశాడు.

వాళ్లిద్దరు తను ఎం.ఎస్.సీ. చదివే రోజుల్లో తన క్లాస్‌మేట్స్ అని చెప్పాడు.

సాగర్, సమతలు ఆ రోజుల్లోనే ప్రేమలో పడిపోయి లవ్ మ్యారేజ్ చేసుకున్నారని చెప్పాడు.



'మీరోసారి మా యింటికి రండి' అని వీళ్ళు, "మీరోసారి మా ఇంటికి రండి" అని వాళ్ళు చెప్పుకొని విడిపోయారు.

"ఆ రోజుల్లో నేను కూడా సమతను ప్రేమించాను తెలుసా?" అన్నాడు రఘు దివ్యతో థియేటర్‌లోకి ప్రవేశిస్తూ. ఆమె అతడన్న ఆ మాట విని "ఇతడిలాంటి మాటే యేదో చెబుతాడని ఊహించు కుంటూనే ఉన్నానను" కుంది.

"అసలు సమతను ఎవరైనా ప్రేమించకుండా ఎలా ఉండగల్గుతారు? చాలా మంచమ్మాయి... స్టడీస్‌లో బ్రిలియెంట్... ప్రవర్తనలో ఎక్సలెంట్... చూడటానికి మార్వలెస్... నన్ను ఇంతగా ఇంప్రెస్ చేసిన అమ్మాయి మరొకరు లేరంటే నమ్ము... షీ ఈజ్ సచ్ ఎ నైస్ గర్ల్ యూనో..." అన్నాడతడు పరవశించిపోతూ.

వాళ్లు థియేటర్ లోపలకు వెళ్లి వాళ్ల సీట్లు వెతుక్కొని కూర్చునేంతవరకు అతడు సమతను పొగుడుతూనే ఉన్నాడు.

దివ్య మూడంతా చెడిపోయింది. ఆమెకు సినిమా చూడాలనిపించలేదు. వెంటనే ఇంటికెళ్ళిపోయి భోరుమని యేడవాలనిపించింది.

చూసిన ఆడదాన్నల్లా ఇలా పొగిడేస్తూ, ఆమెను ప్రేమించానంటూ... ఎవరికో కాదు... తన భార్యతోనే చెప్పే ఈ పురుషపుంగవున్ని ఎలా అర్థం చేసుకోవాలో ఆమె తెల్చుకోలేక పోయింది. యేమన్నా అంటే "జస్ట్ ఫర్ ఫన్ అలా చెప్పాలే" అంటాడు. "జోక్ చేశానని" నవ్వేస్తాడు. లేకపోతే "నువ్వెలా రియాక్టవుతావో చూద్దామని" అలా చెప్పానంటాడు.

మొదట్లో ఒకటి రెండుసార్లు అతడలా కనిపించిన అమ్మాయినల్లా పొగిడేస్తుంటే 'పోన్లే' అనుకుంది. కానీ రోజురోజుకు అతడు కనిపించిన ప్రతి అమ్మాయికేసి అదేపనిగా చూడటం, కొద్ది పరిచయం ఉన్నా ఆమెతో అతి చనువుగా మాట్లాడటం, ఆమెతో తనకేదో ఎఫైర్‌లాంటిది ఉందని చెప్పడం ఆమెను కృంగదీసింది. అందమైన అమ్మాయిలను గురించి ఇలా మాట్లాడటం అతనికో 'పిచ్చి'లా

---

***"అసలు సమతను ఎవరైనా ప్రేమించకుండా ఎలా ఉండగల్గుతారు? చాలా మంచమ్మాయి... స్టడీస్‌లో బ్రిలియెంట్... ప్రవర్తనలో ఎక్సలెంట్... చూడటానికి మార్వలెస్... నన్ను ఇంతగా ఇంప్రెస్ చేసిన అమ్మాయి మరొకరు లేరంటే నమ్ము... షీ ఈజ్ సచ్ ఎ నైస్ గర్ల్ యూనో..." అన్నాడతడు పరవశించిపోతూ.***

---

మారిందేమోననిపించిందామెకు. తనతో మాత్రం ఒక్కసారైనా "నీలాంటి అమ్మాయి నాకు భార్యగా లభించటం నా అదృష్టం! అనో "నువ్వు మంచమ్మాయి"వనో చెప్పిన పాపాన పోలేదు. అతనికెంతసేపూ ఇతరుల్ని పొగడటమే పని. "అతనికున్న ఈ పిచ్చిని కుదర్చటం ఎలాగా?" అని ఆమె చాలాసార్లు ఆలోచించింది.


కొద్దిరోజుల తర్వాత దివ్య రఘులు కలిసి ఓ పెళ్లికెళ్ళారు.

పెళ్ళికొడుకు రఘుకు చాలా దగ్గరి మిత్రుడు.

ఆ పెళ్ళిలో రఘుకు చాలామంది మిత్రులు కలిశారు. అయితే వాళ్ళల్లో ఆడవాళ్లెవరూ లేకపోవడం దివ్యను కొంచెం ఆశ్చర్యపరిచింది. దాంతో రఘు సాక్షాత్ పెళ్ళికూతుర్ని గురించే చెప్పడం మొదలెట్టాడు.

ఒకప్పుడు ఈ పెళ్లికూతుర్ని తనకిద్దామనుకున్నారనీ, పెళ్లిచూపులు కూడా జరిగాయని, తను కూడా ఆమెను ఇష్టపడ్డాడనీ, చివరకు యేదో కారణంచేత తమ పెళ్ళి జరగలేదని దివ్యతో చెప్పడం మొదలెట్టాడు. అతడలా చెబుతుండగానే "హాయ్ దివ్యా!" అంటూ ఓ అందమైన యువకుడొచ్చి దివ్యను పలకరించాడు. అతన్ని చూడగానే దివ్య కూడా హుషారుగా "హాయ్ ప్రదీప్... బాగున్నావా?" అంటూ అతన్ని పలకరించింది.

వాళ్ళిద్దరికేసి రఘు కళ్ళప్పగించి చూడసాగాడు.



"బాగున్నాను దివ్యా... అయామ్ ఫైన్... నిజం చెప్పాలంటే దివ్యంగా ఉన్నాను దివ్యా... నువ్వెలా ఉన్నావు?" అన్నాడు ప్రదీప్, యేదో జోక్ వేశానన్నట్టుగా నవ్వుతూ.

"అయామ్ ఫైన్... అది సరేగానీ ఎంతకాలానికి కనిపించావు ప్రదీప్! ఇంతకాలం ఏమైపోయావు నువ్వు?" అంది దివ్య చాలా బాధపడిపోతున్నట్టు.

"నాకు ఢిల్లీలో జాబొచ్చింది దివ్యా! రెండేళ్ళుగా ఢిల్లీలోనే ఉంటున్నాను. బైదిబై... ఇతడు నీ హజ్బెండా? అయితే నీ పెళ్ళయిపోయిందన్న మాట! కనీసం నాకు నీ వెడ్డింగ్ ఇన్విటేషనైనా పంపలేదు. అంటే నువ్వు నన్ను పూర్తిగా మరిచిపోయావన్నమాట, దీసీజ్ వెరీ బ్యాడ్ దివ్యా... వెరి వెరీ బ్యాడ్" అన్నాడు ప్రదీప్ బోల్డు బాధ పడిపోతున్నట్టుగా నటిస్తూ.

"సారీ ప్రదీప్... నా పెళ్ళి ఈయనగారితో చాలా సడెన్‌గా ఫిక్సయిపోయింది. నీకు ఇన్విటేషన్ పంపిద్దామనుకున్నాను. కానీ నీ అడ్రస్ తెలిస్తేగా? నువ్వు నీ పాత అడ్రస్‌లో లేవని తెలిసింది. అదంతా పోన్లేగానీ నీకు నా హబ్బీని పరిచయం చేస్తానుండు...? ఈయన నా హజ్బెండ్ డా॥ రఘురాం" అంది దివ్య.

"హాయ్ రఘురాంగారూ... మిమ్మల్ని కలుసుకున్నందుకు చాలా సంతోషిస్తున్నా... మా దివ్య చాలా మంచిపిల్ల... షీ ఈజ్ ఎన్ ఏంజెల్... దేవత. నిజంగా దివినుండి భువికి దిగివచ్చిన దేవత. దివ్యను మీరు చేసుకున్నారంటే మీరెంత అదృష్టవంతులో నేనూహించలేకపోతున్నా... అయామ్ రియల్లీ జెలస్ ఆఫ్ యూ... మీ మీద నాకు నాకు నిజంగా ఈర్ష్య కల్గుతోంది. అవునూ... మీరేం చేస్తుంటారు?" అన్నాడు ప్రదీప్.

"ఆయన ఇక్కడి హైదరాబాద్ యూనివర్సిటీలో కెమిస్ట్రీ లెక్చరర్‌గా పని చేస్తున్నాడు. ఈ మధ్యనే రిసెర్చ్ కూడా చేసి డాక్టరేట్ తీసుకున్నాడు" అంది దివ్య.

"ఓ, ఐసీ... సాహిత్యమన్నా, సంగీతమన్నా పడి చచ్చేదానివి. చివరకు కెమిస్ట్రీ లెక్చరర్‌ను చేసుకున్నావా? ఇట్స్ ఓ.కె... ఓ.కె... అంతా రాసి పెట్టినట్టు జరుగుతుంది. మనం కేవలం నిమిత్త మాత్రులం... మ్యారేజెస్ ఆర్ మేడిన్ హెవెన్ అంటారుగా... ఎలాగో అడ్జస్టయిపోవాలి... జీవితమంటేనే అడ్జస్ట్‌మెంటాలిటీ కదా! లేకపోతే ఈ పాడు ప్రపంచంలో బతకలేం దివ్యా" అంటూ ప్రదీప్ గొల్లున నవ్వాడు.

"పోన్లే ప్రదీప్... నా సంగతి వదిలేయ్, నీ సంగతేమిటి? పెళ్ళి చేసుకున్నావా?" అంది దివ్య.

"పెళ్ళా? అది నాకు దేవుడు రాసిపెట్టలేదుగా"

"అదేమిటి? నువ్వు పెళ్ళెందుకు చేసుకోలేదు?"

"నీలాంటి అమ్మాయి దొరికితే తప్ప పెళ్ళంటూ చేసుకోవద్దని గట్టిగా ఎప్పుడో నిర్ణయించుకున్నాను" అన్నాడు ప్రదీప్.

అతడన్న ఆ మాటతో దివ్య ఆశ్చర్యంతో నోరు తెరచుకొని ఉండిపోయింది. అంతా యేదో కలలో జరుగుతున్నదన్నట్లుగా రఘు బిత్తరపోయి వాళ్లిద్దర్ని నిశ్శబ్దంగా చూస్తూ ఉండిపోయాడు.

ఈలోగా ఎవరో "హాయ్ ప్రదీప్!" అంటూ ప్రదీప్‌ను పలకరించారు. ప్రదీప్ అతన్ని గట్టిగా కౌగలించుకొని ఎంత కాలానికి కలిశావురా ప్రకాష్!" అంటూ అతనితో వెళ్ళిపోయాడు.

"ఈ ప్రదీపెవరు?" అన్నాడు షాక్‌లోంచి అప్పుడే తేరుకుంటున్న రఘు. అతని మొఖం కందగడ్డలా కందిపోయింది. అతనికి మాట కూడా స్పష్టంగా రావడం లేదు.

"పోన్లే ప్రదీప్... నా సంగతి వదిలేయ్, నీ సంగతేమిటి? పెళ్ళి చేసుకున్నావా?" అంది దివ్య.
"పెళ్ళా? అది నాకు దేవుడు రాసిపెట్టలేదుగా"
"అదేమిటి? నువ్వు పెళ్ళెందుకు చేసుకోలేదు?"
"నీలాంటి అమ్మాయి దొరికితే తప్ప పెళ్ళంటూ చేసుకోవద్దని గట్టిగా ఎప్పుడో నిర్ణయించుకున్నాను" అన్నాడు ప్రదీప్.

"నేను ఉస్మానియాలో ఎం.ఏ. చదువుతున్న రోజుల్లో అతడు నాకు పరిచయమయ్యాడు. ఎం.ఏ.పొలిటికల్ సైన్స్‌లో జాయినయిన అతడు నేను ఎం.ఏ.తెలుగు చేస్తున్నానని తెలుసుకొని అతడూ ఎం.ఏ.తెలుగులో జాయినయ్యాడు. నన్ను పిచ్చిగా ఆరాధించేవాడు. మా ఇద్దరి అభిరుచులు చాలా కలిశాయి. చలం, శ్రీశ్రీ, కృష్ణశాస్త్రి రచనలంటే ప్రాణమిచ్చేవాళ్లం. అయితే ఎం.ఏ. అయిపోగానే ఆయన నాకు మళ్ళీ కనిపించడం ఈరోజే" చెప్పింది దివ్య.

"అంటే... అంటే... అతడు నీ మాజీ ప్రేమికున్నడన్నమాట..." గంభీరంగా అన్నాడు రఘు.

"మీరు ఎందుకంత గింజుకుంటున్నారు? క్లాస్‌మేట్స్ అందరూ మాజీ ప్రేమికులై పోతారా? మీరు మీ స్నేహితురాళ్లను ఎంతోమందిని నాకు పరిచయం చేశారు. ఒకప్పుడు వాళ్ళంటే పడిచచ్చేవాడిననీ, ఆమెను ప్రేమించాననీ చెప్పారు. "వాళ్లంతా మీ మాజీ ప్రియురాళ్లా?" అని నేనెప్పుడైనా మిమ్మల్ని అడిగానా?" అంది దివ్య.

"ఓహో! నువ్వు ఆ దారిలో వచ్చావా? నేను ఊరికేనే... జస్ట్ ఫర్ ఫన్... అలా చెప్పేవాడిని. నిన్ను యేడిపించాలన్న కోరిక కూడా ఉండేదనుకో... నేను చాలా అందమైనదాన్ని అన్న పొగరు నీలో ఉందని నాకనిపించేది. ఆ పొగరు అణచాలనే నేనలా వేరే ఆడవాళ్లను పొగిడేస్తూ మాట్లాడేవాడిని... నిజానికి వాళ్లతో నాకు ముఖపరిచయం తప్ప మరేమి లేదు. నాకు చాలామంది అందమైన ఆడవాళ్లతో పరిచయం ఉందంటే అదో గొప్పతనంగా నువ్వు భావిస్తావనుకునే వాడిని. కానీ నీకూ ప్రదీప్‌కు మధ్య చాలా గాఢమైన సంబంధమే ఉందనిపిస్తోంది. మీ ఇద్దరి మధ్య చాలా కథే నడిచి ఉంటుందనిపిస్తోంది" అన్నాడు రఘు.

"చాలా కథ కాదు... మీరూహించుకుంటున్న కథేది నడవలేదు. నేనూ జస్ట్ ఫర్ ఫన్... మీలాగే అతనితో చాలా చనువున్నట్టుగా నటించాను. మేం అప్పుడప్పుడు మా కిష్టమైన కవులను గురించి నవలలను గురించి మాట్లాడుకునేవాళ్లం... దట్సాల్... అంతకుమించి మా మధ్య ఇంకేమీ లేదు..." అంది దివ్య.

"నీలాంటి అమ్మాయి దొరికితేనే పెళ్ళి చేసుకుంటానంటున్నాడు... అదేమిటి?" అన్నాడు రఘు.

"అతడలా ఎందుకన్నాడో నాకూ తెలీదు... అతడామాట అనడం నన్ను కూడా చాలా ఆశ్చర్యపరిచింది. అయినా అది అతడి సమస్య. అతడు పెళ్ళి చేసుకుంటాడు... చేసుకోడు... అది అతడి సమస్య తప్ప మన సమస్య కాదు. అతడు కూడా జస్ట్ ఫర్ ఫన్ ఆ మాట అని ఉంటాడేమో! అతడు మళ్ళీ మనకు కనిపించకనే పోవచ్చు. కాబట్టి అతన్ని గురించి మీరు ఆలోచించడం ఎంత త్వరగా మరచి పోతే మీ ఆరోగ్యానికి అంత మంచిది. మీరు నాకు పరిచయం చేసిన అమ్మాయిలను గురించి నేను ఆలోచిస్తూ కూర్చుంటే మీతో ఇలా కాపురం చేసేదాన్నే కాదు. నేను వాళ్లను మరచిపోయినట్టే మీరూ ప్రదీప్‌ను మరచిపోవాలి" అంది దివ్య.

"అంటే... నువ్వూ నేను సమానమేనన్నమాట" అన్నాడు ఆశ్చర్యంగా అతడు.

"అన్నమాటే కాదు... ఉన్నమాట కూడా... "నాకు ఎంతమందైనా గర్ల్ ఫ్రెండ్స్ ఉండొచ్చు... కానీ నా భార్యకు మాత్రం ఒక్క బోయ్ ఫ్రెండ్ కూడా ఉండకూడదు" అనుకునే మీ పురుష మనస్తత్వం మారాలి డా॥ రఘుగారూ!" అంది దివ్య అతని చేతిలో చెయ్యేస్తూ.

●